భోగి సంబరాలు


బత్తలపల్లిలో ఓ దుకాణం వద్ద గుమ్మడి కాయలు, పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


బత్తలపల్లి: ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ కోటి సుధ

బత్తలపల్లి/తాడిమర్రి/కదిరి టౌన్/గాండ్లపెంట: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఆదివారం సంక్రాంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భోగి పండుగ సందర్భంగా తెల్లవారుజామున ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. ఇంట్లోని పాత వస్తువులను మంటల్లో వేశారు. మహిళలు పాటలు పాడుతూ భోగి మంటల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం మహిళలు తమ ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు. ముగ్గు మధ్యలో గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేపట్టారు. తల్లిదండ్రులు చిన్నారులపై రేగిపళ్లు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణేలు, చెరుకు గడ్డల ముక్కలు కలిపి వారిపై పోసి దిష్టి తీశారు. బత్తలపల్లి శివాలయం వద్ద శివదీక్షాపరులు భోగి మంటలు వేసి నాట్యం ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. బత్తలపల్లి, తాడిమర్రి, గాండ్లపెంట కదిరిలో పూజా సామగ్రి, గుమ్మడి కాయల కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర ఆలయం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. యువతులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. ప్రథమ బహుమతి మనోజ్ఞ, ద్వితీయ బహుమతి విజయలక్ష్మి, తృతీయ బహుమతి మందల లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోటి సుధ ప్రధాన అర్చకుడు కేశవ స్వామి సాకే గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి, శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాండ్లపెంట మండలం వేపరాల పంచాయతీ బోయపల్లిలో వెలసిన తిరుమలదేవుని ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండ్రోజుల పాటు ఆ దేవుడి కాపుల ఆధ్వర్యంలో పూజలు జరగనున్నాయి. ఆదివారం రాత్రి భక్తులు తిరుమల దేవుడికి మొక్కుబడులు చెల్లించుకునే భక్తులు గొడుగుల మేరవణితో తిరుమలదేవుడి కొండపైకి చేరుకున్నారు. రాత్రంతా జాగరణ చేసిన అనంతరం తెల్లవారుజామున గ్రామానికి చేరుకుంటారు. రెండో రోజు సోమవారం రాత్రికి చెక్కభజన తదితర ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. రెండు రోజుల పాటు దాతలు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు.


పూజలందుకున్న తిరుమల దేవుడు

గొబ్బెమ్మలకు పూజలు

కనగానపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం భోగి పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేసుకొని, వాటి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇళ్ల లోగిళ్లలో మహిళలు అందమైన ముగ్గులు వేసి, వాటిపై గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. వీటితో పాటు ప్రజలు స్థానికంగా ఉన్న ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం చేసుకునే మకర సంక్రాంతి పండుగకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

గాండ్లపెంట: మండల పరిధిలోని వేపరాల పంచాయతీ చెరువుముందర తండాలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ సభ్యులు ఆదివారం గడప గడపకూ వెళ్లి పంపిణీ చేశారు. శ్రీరాముడి చిత్రపటం, కరపత్రాలను అందజేశారు. ఈనెల 22న అయోధ్యలో నిర్వహించనున్న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠకు తరలిరావాలని కోరారు. ఇళ్లలో 5 దీపాలను వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలోఆనంద్, హనుమంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవి, శ్రీన, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఎన్‌పీకుంట: పెడబల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పారిశ్రామికవేత్త ముసల్‌రెడ్డి గారి హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. మండలంలోని పలు పంచాయతీల నుంచి మొత్తం 14 జట్లు టోర్నీలు పాల్గొంటున్నాయి. మొదటి రోజు నాలుగు మ్యాచ్‌లు నిర్వహించారు. పెడబల్లి గేమ్‌చేంజర్స్, ఎన్.పీ.కుంట లెవన్ లడ్డూస్, డీఎంపీ ఫైటర్స్, మండెంవారిపల్లి ప్యాంటర్స్ జట్లు విజయం సాధించాయి. 16వ తేదీన ఫైనల్ మ్యాచ్ జరగనుంది. విజేత జట్టుకు రూ.25,116, రన్నర్స్ జట్టుకు 15,116 మొమెంటోలు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేద్దామని నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్‌అహ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని నిజాంవలీ కాలనీ 13, 14, 15 వార్డు కౌన్సిలర్లు మక్బూల్ అహ్మద్‌కు మద్దతు తెలిపారు. గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి ప్రజలు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇలాహి, నౌషాద్, షామీర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మున్సిపల్ పరిధిలోని నిజాంవలీ కాలనీ 15వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇలాహీ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన అలీమియా, ఆస్వాక్, అహ్మద్, రమణ వీరితో 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్‌అహ్మద్ వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా కృషి చేయాలని సూచించారు.

హెల్మెట్ల పంపిణీ

తనకల్లు: మండలంలోని వివిధ పత్రికల్లో పనిచేస్తున్న విలేకరులకు ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హెల్మెట్లు, స్వీట్స్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు వినోద్‌కుమార్, రామ్‌దేశాయ్, నాయకులు సమర సంహారెడ్డి, సాయి వికాష్, కార్తిక్ పాల్గొన్నారు.


విలేకరులకు హెల్మెట్లు అందజేస్తున్న నాయకులు

ధర్మవరంలో హైమాస్ వెలుగులు

ధర్మవరం: పట్టణంలోని 1వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఇందుకోసం రూ.18 లక్షలు వెచ్చించినట్లు వారు తెలిపారు. పట్టణంలో హైమాస్ లైట్లను ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చెలిమి రామకృష్ణమ్మ, కేతా లోకేష్, వార్డు ఇన్‌చార్జ్‌లు చాంద్‌బాషా, చెలిమి పెద్దన్న, నాయకులు భైముతక రమణ తదితరులు పాల్గొన్నారు.


హైమాస్ లైట్లను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఇటీవల గ్రామంలో తాగునీటి సమస్య ఉందని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.3 లక్షల పంచాయితీ నిధులు మంజూరు చేయించారు. ఆదివారం గ్రామ సర్పంచ్ శాంతాబాయి ఆధ్వర్యంలో బోరు వేయించగా పుష్కలంగా నీరు పడ్డాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ తదితరులు పాల్గొన్నారు.


బోరు వేయిస్తున్న దృశ్యం

లహరికి అభినందన

ముదిగుబ్బ: ఇటీవల విడుదలైన ఎస్ఐ ఫలితాల్లో ముదిగుబ్బకు చెందిన యువతి లహరి ఉద్యోగానికి ఎంపికైంది. ఆదివారం శాంతి ఆనంద స్కూల్‌లో 1994–95 పదో తరగతి పూర్వవిద్యార్థులు లహరిని పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ బొగ్గు సురేష్, దేగల కిషోర్, చంద్రానాయక్, చంద్రమోహన్, హుస్సేన్, ప్రసాద్, జగన్ మోహన్‌రెడ్డి, గురుప్రసాద్, సాగర్‌రెడ్డి, ముష్కిన్‌వలి, రమేష్‌బాబు, రజనీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఐగా ఎంపికైన లహరిని సన్మానిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హరి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కళ్యాణదుర్గానికి చెందిన హరి రామగిరిలో కిరాణాషాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ద్విచక్ర వాహనంపై కళ్యాణదుర్గానికి బయల్దేరాడు. మార్గంమధ్యలో నసనకోటలో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు గాయం కావడంతో అతడిని గ్రామస్తులు 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.